క్లుప్తంగా

ర్యాలీని జయప్రదం చేయండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న చేపట్టనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక నిర్ణయాలు, చారిత్రాత్మక పథకాలతో నాలుగున్నరేళ్లలో 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అటువంటి నాయకుడు మరో 25 ఏళ్లు రాష్ట్రానికి సీఎంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సెంట్రల్ నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. సత్యనారాయణపురం గాయత్రీ కన్వెన్షన్ హాల్ నుంచి బీఆర్టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం, ముత్యాలంపాడు, దాబాకొట్ల సెంటర్, పైపులరోడ్డు మీదుగా కండ్రిక వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

దోమల నివారణకు సహకరించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ జీవీఆర్ నగర్‌లో మలేరియా విభాగం ఆధ్వర్యంలో జరిగిన యాంటీ లార్వా డ్రైవ్‌లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటి కుంటల్లో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. అనంతరం దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. ఎక్కువ రోజులు ఇళ్లల్లో నీటిని నిల్వ ఉంచకూడదని సూచించారు. దోమకాటు నుంచి ప్రజలకు రక్షణ కల్పించడంలో భాగంగా ఎనాఫిలిస్, ఏడిస్ దోమల సంఖ్యను గణనీయంగా తగ్గించే చర్యలను వీఎంసీ చేపట్టినట్లు తెలిపారు. ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు రెండు పూట్ల ఫాగింగ్, మందు పిచికారీ చేయాలని అధికారులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంఒహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్, జయరాజ్ మలేరియాఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దుర్గగుడి కేశ ఖండనశాల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశ ఖండనశాల నాయీబ్రాహ్మణ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా రాలి వెంకట రమణ, గుంటుపల్లి హరికిరణ్‌లు ఎన్నికయ్యారు. దుర్గగుడి కేశఖండన భవన కార్యాలయంలో శనివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాత కార్యవర్గాన్ని రద్దు చేయడంతో పాటు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ గౌరవ సలహాదారులుగా గుంటుపల్లి రామదాసు, ఏజీఎల్ నారాయణలను ఎన్నుకోగా, గౌరవ సలహాదారు నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా రాలి వెంకట రమణ, సెక్రటరీ గుంటుపల్లి హరికిరణ్(చిన్ని), కోశాధికారి అమలాపురపు పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు గాడిల్లా రాజేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవిడి రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.కిశోర్, సంతోష్, ఆంజనేయులు, నరేష్, కె.చింతయ్య, ఆర్.రమణలను ఎన్నుకున్నారు.

సోమేపల్లి మృతి తీరని లోటు

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం వ్యవస్థాపకుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య మృతి రచయితల సంఘానికి తీరని లోటని కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.బుద్ధప్రసాద్‌లు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా రచయితల సంఘం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారన్నారు. ఆయన మినీ కవితా ప్రచార ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుకు చేశారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో గుంటురులో కొద్ది రోజుల క్రితం ఆయనను కలిసి, సత్కరించామని ఆ ప్రకటనలో తెలిపారు.

ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు రాష్ట్ర స్థాయి బహుమతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పలు అంశాల్లో రాష్ట్ర స్థాయి బహుమతులు లభించాయి. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ చేతుల మీదుగా ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి శనివారం బహుమతులను అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యాన అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన వార్షిక బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందుకున్నారు. నాక్ ఏ గ్రేడ్, బెస్ట్ ఇన్క్యుబేషన్ సెంటర్, ఉత్తమ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు రిపోర్ట్, ఉత్తమ స్టార్టప్, ఉత్తమ వలంటీర్ విభాగాల్లో కళాశాలకు బహుమతులు లభించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ జి.నాగేశ్వరరావు, విద్యార్థులు తేజస్విని, సుధీర్, విజయ్‌లు బహుమతులు అందుకున్నారు.

నగర వాసులకు ఆరోగ్యం, ఆహ్లాదమే ధ్యేయం

- నగరంలోని 14 పార్కులకు అధునాతన హంగులు
- రూ. 81.75 లక్షలతో సామగ్రి ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



విజయవాడ రెవెన్యూ కాలనీలోని పార్కులో వ్యాయామం చేస్తున్న ప్రజలు

పటమట(విజయవాడతూర్పు): పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఆహ్లాదానికి.. ఆనందానికి దూరమవుతున్న నగర జీవనాన్ని పరిగణలోకి తీసుకుని విజయవాడ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఆరోగ్యాన్ని అందించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయూడీ) శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆంధ్రప్రదేశ్ పురపాలక అభివృద్ధి ప్రాజెక్ట్(ఏపీఎండీపీ) సూచనలతో పార్కులను మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు విజయవాడ నగరపాలక సంస్థ కూడా అందుకు అనుగుణంగా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న పార్కుల్లో అవుట్‌డోర్ జిమ్ ఎక్విప్‌మెంట్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటుంది. నగర వ్యాప్తంగా ఇప్పటికే 20 పార్కుల్లో ఇలాంటి చర్యలు తీసుకోగా మరిన్ని పార్కుల్లో ఈ విధమైన వసతులు కల్పించడానికి పలు ప్రతిపాదనలు వచ్చాయి. ఈ మేరకు నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న 14 పార్కులను ఆధునీకరించి స్థానికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు ఆయా పార్కుల్లో ఇప్పటికే ఓపెన్ ఎయిర్ జిమ్‌లను ఏర్పాటు చేయగా మరి కొన్నింటిలో అమర్చేందుకు ఇటీవల జరిగిన వీఎంసీ స్థాయీసంఘంలో ఆమోదం పొందింది.

ఆధునీకరించనున్న పార్కులివే

- దర్శిపేట పార్క్ రూ.6.20లక్షలు
- ఎస్‌బీఐ కాలనీ పార్క్ రూ.7 లక్షలు
- రెవెన్యూ కాలనీ పార్క్ రూ.6.50 లక్షలు
- కనకదుర్గానగర్ కాలనీ పార్క్ రూ.5.8 లక్షలు
- నాగార్జున నగర్ పార్క్ రూ.4.50 లక్షలు
- గులాబీతోట పార్క్ రూ. 5.20 లక్షలు
- దుర్గాపురం పార్క్ రూ. 6 లక్షలు
- ముత్తవరపు నాగరాజకుమారి పార్క్ రూ. 5.35 లక్షలు
- చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్క్ రూ.6.50 లక్షలు
- అంబేద్కర్ పార్క్ రూ.5.60 లక్షలు
- ఏపీఐఐసీ కాలనీ పార్క్ రూ. 5.80 లక్షలు
- తెలుగుతల్లి పార్క్ రూ. 4.50 లక్షలు
- నెల్సన్‌మండేలా పార్క్ రూ.6.20 లక్షలు
- వెటర్నరీ కాలనీ పార్క్ రూ.6.60 లక్షలు

ఆరోగ్యాన్ని పెంపొందించేందుకే..

నగర వాసులకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని కూడా అందించే క్రమంలో నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో అభివృద్ధి చేసిన పార్కుల్లో ఓపెన్‌జిమ్, ఇతర క్రీడా పరికరాలను అమర్చుతున్నాం. నగరంలో మొత్తం ఇప్పటి వరకు 30 పార్కుల్లో ఓపెన్‌జిమ్‌కు ప్రతిపాదనరాగా తొలివిడతగా 14 పార్కుల్లో పరికరాలను అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే మరిన్ని పార్కుల్లో కూడా వీటిని ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం.

ఏఎస్ఎన్ ప్రసాద్,
ఈఈ, పార్క్స్, వీఎంసీ

పాలనలో ఆదర్శంగా నిలిచాం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విద్యుత్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పాలనలో ఆదర్శంగా నిలిచామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి నగరపాలకసంస్థ అధికారులతో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందడంతో నగరం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యిందన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీఒక్క డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ఈ డివిజన్‌లో రూ. 18.21 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

33 కేవీ విద్యుత్‌లైన్ మార్చాలి

నివాసాల మధ్యలో ప్రమాదకరంగా మారిన 33 కేవీ విద్యుత్ లైన్‌తో పాటు విద్యుత్ స్తంభాలను మార్చాలని ఎమ్మెల్యే విష్ణు విద్యుత్‌శాఖ ఏడీ బసవేశ్వరరావుకు సూచించారు.

రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసింది చంద్రబాబే..

2014–19 మధ్య రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన చంద్రబాబు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి హోదాను సమాధి చేసింది ఎవరో సమాధానం చెప్పాలన్నారు. జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టును టేక్ ఓవర్ చేసి, ఇష్టానుసారంగా నిధులను దోచుకుంది మీరు కాదా? అని ప్రశ్నించారు. కేవలం బాబు భజనల కోసమే రూ. వందల కోట్ల నిధులను దుబారా చేశారని.. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్‌తో రూ. 843.53 కోట్లను ఆదా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల గూర్చి ప్రతిపక్షనేత మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సుబ్బారెడ్డి, రఫీ, డి.దుర్గారావు, ఎస్.రామకృష్ణ, నవాబ్, మోహన్, డి.కృష్ణ, నగర ప్రసాద్, మణికంఠ, ఘనీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుధా సైన్స్ క్వెస్ట్



ప్రదర్శనను తిలకిస్తున్న న్యాయ నిర్ణేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేటి బాలలే.. రేపటి ప్రపంచ సారథులు అని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మ్యాథ్స్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ బేబిరాణి అన్నారు. బాలలను విజ్ఞాన పథంలో నడిపించడంతో పాటు వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం నిర్వహించిన సుధా సైన్స్ క్వెస్ట్ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బేబిరాణి మాట్లాడుతూ.. బాల్యదశలోనే వారిలో వైజ్ఞానిక కాంతులు వికసింప చేసి, పరిశోధనా రంగం వైపు అడుగులు వేయిస్తే దేశాభివృద్ధి తారాపథంలో నడుస్తుందన్నారు. ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రదర్శనలో 500 మంది విద్యార్థులు 450కి పైగా సైన్స్ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలోని ఎర్త్‌క్వేక్ అలారం, రిమోట్ ఆపరేటెడ్ టాయిలెట్ ఫర్ పేషెంగ్, సైకిల్ వాషింగ్ మెషిన్, అగ్రికల్చర్ రోబోట్, గ్లూకోజ్ మానిటర్, వంటివి ఆకట్టుకున్నాయి. ఆయా తరగతుల వారీగా పి.సుగంధకుమార్, ఎస్‌పీహెచ్ కృష్ణంరాజు, జె.పాండురంగారావు, బి.శృతి, ఎస్‌కే ఇస్మాయేల్ ఆలీబాషా, జి.శకుంతల, షేక్ ఖాజా ముస్వరీన్, ఉదయ్‌కుమార్, రవిశంకర్, ప్రభాకరరావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ సీహెచ్ భారతి, అకడమిక్ కో ఆర్డినేటర్ బి.పావని తదితరులు పాల్గొన్నారు.

నేడు మైనార్టీ హక్కులు, బాధ్యతలపై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మైనార్టీ రైట్స్ డేను పురస్కరించుకుని ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మైనార్టీ హక్కులు, బాధ్యతలపై ఆదివారం సదస్సు నిర్వహించనున్నట్లు మిల్లీకౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునీర్ అహ్మద్ షేక్ తెలిపారు. గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఈ సదస్సులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి మిల్లీకౌన్సిల్ సభ్యులు, మైనార్టీ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జాతీయ కార్యదర్శి షా ఖాద్రి ముస్తఫా రిఫాయి సదస్సులో పాల్గొని దేశంలో మైనార్టీలు ఎదుర్కొంటున్న అంశాలపై చర్చిస్తారన్నారు. ముఖ్యంగా వక్ఫ్ చట్టం -1995ను రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ హర్నాథ్‌సింగ్ యాదవ్ రాజ్యసభలో ప్రైవేటు బిల్లును ప్రవేశ పెట్టడం వంటి పలు అంశాలపై చర్చించనున్నట్లు మునీర్ అహ్మద్ పేర్కొన్నారు.

మోటారు సైకిల్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీకి చెందిన సుబ్బారావు(42) అనే వ్యక్తిని మోటారు సైకిల్ ఢీ కొట్టిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, వాంబేకాలనీకి చెందిన అవారు సుబ్బారావు ఈ నెల 12వ తేదీన పైపులరోడ్డు నుంచి వాంబేకాలనీకి వెళ్తుండగా గుర్తు తెలియని మోటారు సైకిల్ ఢీ కొట్టింది. గాయాల పాలైన సుబ్బారావు పటమటలోని రమిజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు



గాయకులను సత్కరిస్తున్న విజయబాబు, నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కవులు కళాకారుల సంక్షేమానికి అధికార భాషా సంఘం కట్టుబడి ఉందని అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. శ్రీ ఘంటసాల కళాసమితి, శ్రీ లలిత కళా ప్రవంతి, ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయబాబు మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులని, వారి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో భాషా, సంస్కృతి, సంప్రదాయాల కృషికి కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఘంటసాల లాంటి గాయకులు అరుదుగా జన్మిస్తారన్నారు. తెలుగు వారున్నంత వరకు ఘంటసాల స్వరం సజీవంగా నిలిచి ఉంటుందని చెప్పారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ ఘంటసాల కేవలం సంగీత, దర్శకుడు, గాయకుడు మాత్రమే కాదని స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. ఎక్స్‌రే ప్రధాన కార్యర్శి బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ.. నగరంలో ప్రభుత్వం ఘంటసాల పేరుతో సంగీత కళాశాల నిర్వహిస్తున్నామన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, ఘంటసాల కళాసమితి వ్యవస్థాపకుడు శర్మ తదితరులు పాల్గొన్నారు. గాయకులు ఘంటసాల చిత్రగీతాలను గానం చేశారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

గొప్ప గాంధేయవాది చింతలపాటి రాజు



చింతలపాటి రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గొప్ప గాంధేయవాది విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు అని మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు అన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా గాంధేయవాది చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరాజు గ్రంథాలయం అధ్యక్షుడు కె.సుబ్బరాజుతో కలిసి చింతలపాటి రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. 1800 ఎకరాల భూమిని పేదలు, విద్య కోసం దానం చేసిన మహోన్నత వ్యక్తి చింతలపాటి రాజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ కార్యదర్శి పీవీ సుబ్బరాజు, కోశాధికారి టీ శ్రీనివాసరాజు, సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, కార్యదర్శి కేవీఎస్ ప్రసాదరాజు, కార్యవర్గ సభ్యులు పీ రాంబాబు, ఆర్ పిచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సర్ప సుబ్రహ్మణ్య యాగం



గణపతి విగ్రహాన్ని యాగశాలకు తీసుకువస్తున్న శివాచార్యులు

విజయవాడ కల్చరల్: శివజ్ఞాన పీఠం(శ్రీశివసాయి క్షేత్రం) ఆధ్వర్యంలో లోక సంరక్షార్థం, ప్రజా సంక్షేమం కోసం మూడు రోజులపాటు నిర్వహించే సర్ప సుబ్రహ్మణ్య యాగం దుర్గాపురంలోని సంగీత కళాశాలలో శనివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్యులు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు గణపతి హోమం, పుణ్యాహవచనం, రక్షాబంధన, అష్టగణపతి హోమంతో మొదలయ్యాయి. స్వామిజీ మాట్లాడుతూ వేద సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసముందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావన భారతీయ సంస్కృతిలో భాగమని చెప్పారు. పీఠం నిర్వహించే కార్యక్రమంలో శివస్వామి, వాసుదేవానందగిరి స్వామి, మతా శివచైతన్య, అష్టాక్షరీ స్వామి అనుగ్రహ భాషణ చేస్తారని తెలిపారు. స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా మాతా శిశు సంరక్షణ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాతా శిశు సంరక్షణ సేవలు మరింత విస్తృతం చేసి పటిష్టవంతంగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శనివారం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ సేవలను వెబ్‌సైట్‌లో నమోదు, సురక్షిత ప్రసవాలు, శిశువులకు ఆరోగ్య సేవల లక్ష్యాలు సాధన వంటి అంశాలపై దిశా నిర్దేశం చేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కార్యక్రమం అమలులో భాగంగా ఈ నెల 18 నుంచి లాంఛనంగా జిల్లాలో కొత్త కార్డుల పంపిణీ, బ్రోచర్‌లు అందించడం వంటి వాటిపై అవగాహన కలిగించారు. కార్డుల పంపిణీ విషయంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఆరోగ్యశాఖ సిబ్బంది పంపిణీలో పాల్గొనాలన్నారు. కొత్త కార్డులు అందించడంతో పాటు, ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతం చేసిన విషయాలను వారికి వివరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ సుమన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీపీయంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ మాధవి, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అను మైబేబీ హాస్పిటల్స్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పావని మాణిక్యపాలెపు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సైన్స్ అండ్ హుమానీటీస్ ఆధ్వర్యంలో మహిళా రుతు సమస్యలపై అవగాహనా సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ.. రుతుక్రమ సమయంలో ప్రతి మహిళా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినుల సందేహాలను పవర్‌పాయింట్ ద్వారా నివృత్తి చేశారు. అంతేకాకుండా పరిశుభ్రతతో ఉండాలని, పౌష్టికాహారాన్ని, వ్యాయమం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

18న నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఈ నెల 18వ తేదీన అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భవానీపురంలోని హెడ్ వాటర్‌వర్క్స్‌లోని 8 ఎంఈడీ క్లియర్ వాటర్ సంపును శుభ్రపరుస్తున్నందున ఈ ప్రాంటును బ్రేక్ డౌన్ చేస్తున్నామన్నారు. దీంతో సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. జీవీఆర్ నగర్, వాంబే కాలనీ-1, 2, రాజీవ్‌నగర్ ఉడా కాలనీ, కండ్రిక విలేజ్ ఆంధ్రప్రభ కాలనీ, రాజరాజేశ్వరిపేట, అజిత్ సింగ్‌నగర్-1, 2, 3, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, శాంతికాలనీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్, ప్రైజర్‌పేట, టన్నెల్ బూస్టర్ ప్రాంతాల్లోని రిజర్వాయర్లకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వీటితోపాటు హెడ్‌వాటర్‌వర్క్స్ నుంచి నేరుగా తాగునీటి సరఫరా జరిగే కేదారేశ్వరరావుపేట, రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ, శాంతినగర్, అజిత్‌సింగ్ నగర్, కేఎల్‌రావు నగర్, మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంతాల్లో కూడా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంత వాసులు ముందుగానే నీటిని నిల్వచేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఓ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ అధ్యక్షతన కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల తీరును వివరించారు. అలాగే వినియోగదారుల భావోద్వేగాలతో అమ్మకందారులు ఎన్ని రకాలుగా మోసం చేస్తారో తెలియజేశారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకుని కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాకారుల ఆత్మీయ సమావేశం



విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి సంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళాకారుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి కార్యక్రమాలను హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. తెలుగు అకాడమీ వ్యవస్థాపకుడు చిట్టిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం కళాకారుల కోసం కృషి చేస్తోందన్నారు. కళాసంస్థలు కూడా కళాకారులను ఆదుకోవాలని కోరారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ తమ సంస్థ ద్వారా పేద కళాకారులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. గాయకుడు చిప్పాడ నాగేశ్వరరావుకు నిర్వాహకులు ఆర్థిక సహాయం అందించారు. చెట్లపల్లి మారుతీ ప్రసన్న, న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. గాయనీ, గాయకులు డేవిడ్‌రాజు, నూకరాజు, రేణుక, శ్రీనివాసరావులు పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.